క్లుప్తంగా

వధూవరులకు పీఆర్కే ఆశీర్వాదం

కారెంపూడి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం కారెంపూడిలో పర్యటించారు. పార్టీ మండల నేతలతో కొద్ది సేపు మాట్లాడారు. అనంతరం వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ అక్బర్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. డాక్టర్ గజ్జెల సుధీర్ భార్గవరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తిరునాళ్ల ఏర్పాట్లకు టెండర్లు పూర్తి..



దుర్గి: ప్రసిద్ధిగాంచిన అడిగొప్పల శ్రీ నిదానం పాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల నిర్వహణకు సంబంధించిన సీల్డ్ కవర్ టెండర్ల ప్రక్రియ గురువారం ముగిసింది. మార్చి 12న తిరునాళ్ల ఏర్పాట్లలో భాగంగా ఆలయ అలంకరణకు రూ. 140 లక్షలు, క్యూ లైన్‌కు రూ. 1.30లక్షలు, లైటింగ్‌కు రూ.1.70లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ. 1.40లక్షలకు పలువురు టెండర్లు దక్కించుకున్నట్లు ఆలయ ఈఓ శ్రీ గిరిరాజు నర్సింహబాబు తెలిపారు. టెండర్ల ప్రక్రియను కారంపూడి ఈఓ కృష్ణంరాజు పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

19న ఉచిత కంటి వైద్య శిబిరం

మాచర్ల: ఈ నెల 19న వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గడియారం స్తంభం పక్కన ప్రాథమిక పాఠశాలలో ఉదయం నుంచి శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కంటి రోగులు ఆధార్, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, ఓటు కార్డు, ఫోన్ నంబర్ తీసుకురావాలని పేర్కొన్నారు. వివరాలకు 98490 65882, 94905 73910 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

మాచర్ల రూరల్: మండలంలోని జమ్మలమడక గ్రామంలో ఓటీఎస్ ఇళ్ల పట్టాలను ఎంపీపీ ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు గురువారం పంపిణీ చేశారు. 32 మందికి వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి, రూరల్ సీఐ షేక్ షమీముల్లా, ఎంపీడీఓ కోటేశ్వరరావు, సర్పంచ్ ముక్కా చౌడయ్య, ఎంపీటీసీ పరిమళ్ళ ఏసోబు, తిప్పారెడ్డి గోపాల్‌రెడ్డి, గొబ్బూరి ఆదయ్య, పంచాయతీ కార్యదర్శి వై.కోటేశ్వరరావు, శ్రీనివాసరావు ఉన్నారు.

రాయవరంలో ఉచిత వైద్య శిబిరం



మాచర్ల రూరల్: మండలంలోని రాయవరం గ్రామంలో అరబిందో ఈఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెకు ఈసీజీ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు సూచించారు. ఈ శిబిరంలో వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పినపాటి సుందరలీల, కార్యదర్శి సత్యనారాయణ, భూలక్ష్మి, రాజేశ్వరి, పినపాటి ప్రవీణ్ తదితరులున్నారు.

రేషన్ ఇంటికి రాకపోతే సమాచారం ఇవ్వండి

నరసరావుపేట: రేషన్ బియ్యం, ఇతర నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఇళ్లవద్దకు రాకపోతే టోల్‌ఫ్రీ నంబరు 1902, లేదా తమ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి జి.మోహన్‌బాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి ఎండీయూ ఆపరేటర్‌కు కేటాయించిన కార్డులను 16రోజులకు విభజించి రూటు వారీగా ప్రణాళిక తయారు చేయించామన్నారు. గత రెండేళ్ల నుంచి ఇదే పద్ధతి అవలంభించటం వల్ల ప్రతి లబ్ధిదారుడికి ఎండీయూ ఆపరేటర్ వచ్చే తేదీ, సమయం తెలుస్తుందన్నారు. వార్డు వలంటీరుకు సమయం తెలియజేయాలని ఆపరేటర్‌కు చెప్పామన్నారు. ఒకచోటనే ఆపి సరుకులు పంపిణీ చేయొద్దని ఆపరేటర్‌కు పలుమార్లు చెప్పటం జరిగిందన్నారు. కార్డులో సభ్యుల వేలి ముద్ర లేకుండా సరుకులు ఇవ్వటం సాధ్యంకాదు కనుక ఎండీయూ ఆపరేటర్ ఇంటివద్దకు వచ్చే సమయానికి ఒకరు ఇంటివద్ద ఉండి రేషన్ తీసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి మాసానికి సంబంధించి ఇప్పటివరకు 86శాతం మందికి పంపిణీ చేశామన్నారు. పంపిణీలో అవకతవకలకు పాల్పడిన పలువురు ఎండీయూ ఆపరేటర్లను సస్పెండ్ చేయటం జరిగిందన్నారు.

ప్రతి ఇంటికీ పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పిస్తాం

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మహిళలకు నవరత్నాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: పేదలు నివసిస్తున్న ప్రతి ఇంటికీ సర్వే నిర్వహించి, పొజిషన్ సర్టిఫికెట్ అందిస్తామని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని 32వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి హారతులు పట్టి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వం పథకాలను ఆయన వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుంటూ.. ముందుకు సాగారు. కాలనీలో ప్రజల ఇళ్లకు పట్టాలు లేకపోవటంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో తహసీల్దారు చక్రవర్తిని లెనిన్‌నగర్, మారుతీనగర్‌కు ఎమ్మెల్యే పిలిపించారు. తక్షణమే పొజిషన్ సర్టిఫికెట్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలనీలో డ్రైయిన్ల సమస్యను సచివాలయానికి మంజూరయ్యే నిధులతో తీర్చాలని కౌన్సిలర్ షేక్ జానీకి సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. మారుతీనగర్, లెనిన్ నగర్‌లో ప్రతి ఇంటికీ మంచినీరు అందిస్తున్నామని, అలాగే మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే కాలనీలో సీసీ రోడ్లు నిర్మించి, నివేశన స్థల పట్టాలు అందించినట్లు తెలిపారు. నూతనంగా పాఠశాలలను కూడా నిర్మిస్తున్నామన్నారు. ప్రతి పేద వాడికి నాణ్యమైన విద్య, వైద్యంతో పాటు నివేశన స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైస్ చైర్మన్‌లు షేక్ జైలాబ్దిన్, కొమ్ము ముక్కంటి, వార్డు కన్వీనర్ దేవళ్ల నాగరాజు, మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎండీ గఫార్, కౌన్సిలర్ ఉప్పు వెంకటేశ్వర్లు, కందులూరి శివయ్య, ఇర్లా గురుస్వామి, కందులూరి శేషు, తిరుమలశెట్టి అంజి, తోడేటి రాజు, కౌన్సిలర్లు అజ్మీర శారద, మాదాల కిరణ్‌కుమార్, షేక్ అబ్దుల్లా, కత్తెరపు వాసుదేవరెడ్డి, షేక్ మస్తాన్ వలి, పసుపులేటి ఆనంద్, మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, మున్సిపల్ డీఈ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల పరిశీలన



అటవీ భూములను పరిశీలిస్తున్న అటవీశాఖ, రెవెన్యూ అధికారులు

దాచేపల్లి: మండలంలోని భట్రుపాలెం గ్రామ సమీపంలో ఉన్న అటవీ భూములను ప్రభుత్వ అధికారులు గురువారం పరిశీలించారు. భట్రుపాలెం సమీపంలోని అటవీ భూముల్లో రంగురాళ్ల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లుగా ఎన్. పిచ్చయ్య అనే వ్యక్తి స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్. రామచంద్రరావు, గురజాల ఆర్డీవో కె.అద్దయ్య అటవీ భూములను పరిశీలించి, రికార్డులు చూశారు. అటవీ భూముల్లో విస్తృతంగా పర్యటించి రంగురాళ్ల కోసం తవ్వకాలు జరిగాయా.. లేదా అని పరిశీలించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామని అటవీశాఖ అధికారి రామచంద్రరావు చెప్పారు. అటవీ భూముల్లో అక్రమంగా ఎటువంటి తవ్వకాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, అనుమతులు లేకుండా అటవీ భూముల్లోకి ప్రవేశించటం చట్టరీత్యా నేరమని ఆయన హెచ్చరించారు. అటవీ భూములపై ప్రత్యేకంగా నిఘా పెట్టామని, తమ సిబ్బంది పర్యవేక్షణ కూడా నిరంతరం ఉంటుందన్నారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ డి.మేరికనకం, ఫారెస్ట్ రేంజ్ అధికారి ఆర్.శేఖర్, డీఆర్వోలు కె.మురళీ, బీవీఎల్ నాయుడు, డీవీ రమణయ్య, వీఆర్వో అఖిల్, సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

లిడ్ క్యాప్ శిక్షణ కేంద్రం పునరుద్ధరణకు కృషి



శిక్షణ కేంద్రాన్ని పరిశీలన

దుర్గి: మండలంలోని అడిగొప్పల గ్రామం వద్ద లిడ్ క్యాప్ శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర లిడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ గురువారం సందర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో త్వరలో లిడ్ క్యాప్ శిక్షణ కేంద్రం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మూతపడిన కేంద్రం పునరుద్ధనకు చర్యలు తీసుకుంటామన్నారు. పల్నాడు ప్రాంతంలో దాదాపు పదివేల మంది దళిత యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో కొంత ప్రాంతం కబ్జాకు గురియ్యిఇ.. 34 ఎకరాలు పైగా ఉన్న లిడ్ క్యాప్ శిక్షణ ప్రాంతం ప్రస్తుతం 17 ఎకరాలకు చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బూదాల మరియమ్మ, నిర్మలా కుమారి, పలువురు కార్మికులు తదితరులున్నారు.

ఉత్సాహంగా వ్యాస రచన పోటీలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్ నగర్ హైస్కూల్‌లో రమణ ఓల్డ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలను గురువారం నిర్వహించారు. అనంతరం విజేతలను ప్రకటించారు. క్విజ్ పోటీల్లో తుమ్మలచెరువు, పిడుగురాళ్ల మన్నెం పుల్లారెడ్డి, జూలకల్లు ఉన్నత పాఠశాలల విద్యార్థులు.. వక్తృత్వ పోటీల్లో జూలకల్లు విద్యార్థి పి. శ్రీకాంత్, పిడుగురాళ్ల విద్యార్థి కె.జాన్ ప్రకాష్ కైవసం, తుమ్మలచెరువు విద్యార్థి ఎస్.చరణ్.. వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఎస్‌బీ ఎస్ఎస్ లోకేష్, హరిల్లా, ఎస్. లక్ష్మీరేఖ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరు రీజినల్ స్థాయిలో ఈ నెల 25న నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు బీవీ రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్లకు పట్టణం ముస్తాబు

- రూ.51లక్షల నిధులతో సౌకర్యాలు
- విద్యుద్దీపకాంతుల్లో మెరిసిపోతున్న రహదారులు



నరసరావుపేట: రాష్ట్ర పండగ కోటప్పకొండ తిరునాళ్లకు పట్టణం ముస్తాబైంది. పగలు ప్రత్యేక రంగులు, రాత్రిళ్లు రంగు రంగుల విద్యుత్ లైట్లతో ప్రధాన రహదారులు, ఫ్లై ఓవర్లు వెలిగిపోతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సుమారు రూ.51లక్షల పురపాలక నిధులతో కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న శివునిబొమ్మ ఐలాండ్‌ను రంగులు వేసి పూలతో తీర్చిదిద్ది రాత్రిపూట ప్రత్యేకంగా కన్పించేలా డిజిటల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. భక్తులు శివుడి బొమ్మను దర్శించుకొని పూజలు చేస్తున్నారు. సెంట్రల్ డివైడర్లు, ఫ్లై ఓవర్లకు రంగులు వేశారు. వాటిపై రంగు రంగుల కాంతులతో ఇల్యూమినేషన్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 60మంది ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి ప్రధాన రహదారులన్నింటిలో ఎటువంటి చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. సుదూర ప్రాంతాల నుంచి పట్టణం గుండా కోటప్పకొండకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం నాలుగు చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు, ఎనిమిది ప్రదేశాల్లో తాగునీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణం నుంచి కొండకు వెళ్లే మార్గంతో పాటు అన్నీ ప్రధాన రహదారుల్లో ఉన్న వీధిలైట్లు, హైమాస్క్‌లైట్లలో వెలగని వాటిని గుర్తించి నూతన లైట్లను ఏర్పాటు చేశారు. ప్రభలు వెళ్లే మార్గంలో రోడ్లకిరువైపులా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి మార్గం క్లియర్ చేశారు. ఈ పనులు చేసేందుకు పురపాలకసంఘంలోని ఇంజనీరింగ్ విభాగం రూ.34లక్షలు వెచ్చిస్తుండగా, పారిశుద్ధ్య విభాగం రూ.17లక్షలు ఖర్చుచేస్తుంది.

ఆర్టీసీ 15 టిక్కెట్ కౌంటర్లు...

భక్తులు కోటప్పకొండకు వెళ్లి తిరిగి బస్సుల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు కావాల్సిన టిక్కెట్లు ఇచ్చేందుకు 15 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి వెల్లడించారు. డిపో వద్ద ఐదు, కొండ కింద మూడు, కొండపైన రెండు, కొండ కింద చిలకలూరిపేట వైపు వెళ్లేందుకు మూడు, వినుకొండ, అద్దంకి వెళ్లేందుకు మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. టిక్కెట్ చార్జీలు గతేడాది మాదిరిగానే ఉంటాయన్నారు. మొత్తం మీద 1300మంది అధికారులు, సిబ్బంది తిరునాళ్ల కోసం పనిచేస్తున్నారన్నారు.

కొండ పండగ మొదలైంది

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలో కొండ పండగ మొదలైంది. మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండ శైవక్షేత్రం త్రికోటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించే తిరునాళ్ల పండగ వాతావరణం గురువారం నుంచే పట్టణంలో కనిపిస్తున్నది. శైవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మాచవరం: మాచవరంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం మండల స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని 6, 7, 8, 9 తరగతి విద్యార్థులకు ఈ పోటీలను రమణ మేడం స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో పిన్నెల్లి హైస్కూల్‌కు చెందిన పి.జమాల్ సైదా, వక్తృత్వ పోటీలలో మాచవరం హైస్కూల్‌కు చెందిన కె.స్నేహ, క్విజ్ పోటీలలో డి.యామిని, ఎస్‌కే సాజియా, ఎస్.గాయత్రీ మొదటి బహుమతి సాధించారు. వారికి సర్టిఫికెట్లు, నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



మాచర్ల: రామకృష్ణ మిషన్ 125వ వార్షికోత్సవాల సందర్భంగా శ్రీ రామకృష్ణ సేవా సమితి నేతృత్వంలో జాగృతి సాంస్కృతిక పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేశారు. గురువారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీలలో బహుమతులు సాధించిన విద్యార్థులకు స్వామి వివేకానంద చిత్రపటాలను, ఆయన జీవిత చరిత్ర పుస్తకాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి, స్కూల్ హెచ్ఎం ఉల్లారెడ్డి, సేవా సమితి సభ్యులు చిన లాలుసాహెబ్, పాపిరెడ్డి, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పికెట్

గురజాల: నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలో పోలీస్ పికెట్‌ను బుధవారం మధ్యాహ్నం నుంచి ఏర్పాటుచేశారు. నాలుగు ప్రాంతాల్లో ముగ్గురు చొప్పున విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నట్లు సీఐ కె.ప్రభాకర్ రావు తెలిపారు. ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో భాగంగా మరలా అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం, హైస్కూల్, గ్రామంలో మరొక రెండు పికెట్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుధవారం జరిగిన దాడిలో భాగంగా యిరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణ చేపట్టి ఇటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడతామన్నారు. ఎప్పటికప్పుడు ఎస్ఐ అశోక్ బాబు పర్యవేక్షిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

దాచేపల్లి: వివాహిత మహిళతో జరిగిన వివాదం కారణంగా ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం జరిగింది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం భట్రుపాలేనికి చెందిన కొడిదేటి మరియదాసు కుమారుడు విజయ్(19) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు విజయ్ తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంధ్యారాణి ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వివాహిత మహిళతో జరిగిన వివాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం అందజేత

విజయపురిసౌత్: మాచర్ల మండలం చింతలతండాలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన రమావత్ భిక్ష్యాలు నాయక్ కుటుంబానికి సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్ వైఎస్సార్ బీమా నగదు రూ.10వేలు గురువారం అందజేశారు. ఎంపీటీసీ సీతానాయక్, వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు గబ్బర్‌సింగ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కలశ ప్రతిష్ఠ

గురజాల: పట్టణంలోని శ్రీ అంకాలమ్మ తల్లి దేవాలయ కలశ ప్రతిష్ఠ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. గాలి గోపురం నిర్మాణం, గణపతి విగ్రహం, సింహ వాహనం, కొర్రు స్తంభం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజులుగా హోమాలు, ప్రత్యేక పూజలు అర్చకుడు పిన్నెల్లి సుబ్రమణ్య శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన..



ప్రథమ బహుమతి సాధించిన గుంటూరు జిల్లా ఎడ్ల బల ప్రదర్శన



బహుమతి ప్రధానం చేస్తున్న సీతారామిరెడ్డి, కమిటీ సభ్యులు

ప్రథమ స్థానం కైవసం చేసుకున్న గుంటూరు జిల్లా ఎడ్ల జత

సత్రశాల(రెంటచింతల): మహా శివరాత్రి సందర్భంగా సత్రశాలలో వేంచేసిన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం సమీపంలోని శివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రంలో నిర్వహిస్తున్న జాతీయ ఒంగోలు జాతి ఎడ్ల బండలాగు ప్రదర్శనలో భాగంగా గురువారం 6 పళ్ల విభాగంలో పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్లు 4,340.7 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. రూ.35 వేలను యజమాని అందుకున్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన యాపర్తి వెంకటేశ్వర్లు, నవీన్‌కుమార్, సాయిగణేష్ ఎడ్లు ద్వితీయ బహుమతి రూ.30 వేలు, పల్నాడు జిల్లా గురజాల మండలం మాడుగుల గ్రామానికి చెందిన కంచుపాడి శ్రీనివాసరావు ఎడ్లు తృతీయ బహుమతి రూ.25 వేలను కై వశం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామానికి చెందిన కానాల వెంకటరెడ్డి ఎడ్లు నాలుగో స్థానంలో నలిచి రూ.20 వేల నగదు బహుమతి కైవసం చేసుకున్నాయి. అన్నదాన సత్రం అధ్యక్షుడు, కమిటీ సభ్యుడు పులి ఓబుల్ రెడ్డి, యర్రెద్దు శ్రీనివాసరెడ్డి, పత్తి కోటిరెడ్డి, గోగుల వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, చింతా శివారెడ్డి, బరువు శ్రీనివాసరెడ్డి, పేరం వెంకటరామిరెడ్డి, గాదె వీరారెడ్డి, సిద్ధవటం శివారెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన నాయకులు మోర్త ఉమామహేశ్వరరెడ్డి, ఇగుటూరు సత్యనారాయణరెడ్డి, ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, గాలి వెంకటరెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, యరసాని వెంకట క్రిష్టారెడ్డి, అల్లం శ్రీనివాసరెడ్డి విజేతలైన ఎడ్ల యజమానులకు వరుసగా బహుమతులను అందచేశారు. డీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్టారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పశర్లపాడు బ్రహ్మారెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, మేకపోతుల కృష్టారెడ్డి, నెవలి సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

మిర్చి రైతులకు కోల్ట్ స్టోరేజ్.. ఏజెంట్లకు లైసెన్స్‌లు..

బాధ్యతలు స్వీకరించిన నడికుడి ఏఎంసీ చైర్మన్ ఆంధ్రయ్య



చైర్మన్ ఆంధ్రయ్యను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

దాచేపల్లి: మిర్చి రైతుల కోసం కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తామని నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కలకండ ఆంధ్రయ్య పేర్కొన్నారు. చైర్మన్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన ఆయన గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆంధ్రయ్య మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలో మిర్చి పంట అధికంగా పండిస్తారని, పంటను భద్రపరుచుకునేందుకు కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. నడికుడి మార్కెట్‌యార్డులోని కొనుగోలు కేంద్రంలో జోరుగా మిర్చి క్రయ, విక్రయాలు జరుగుతున్నట్లు తెలిపారు. గుంటూరు యార్డులోని మిర్చి వ్యాపారులు, ఎగుమతి, దిగుమతిదారులు ఇక్కడ క్రయ, విక్రయాలు జరిపేందుకు ఆసక్తిని చూపుతున్నారని చైర్మన్ వెల్లడించారు. మిర్చి కమీషన్ ఏజెంట్లకు యార్డులో దుకాణాలు కూడా అందుబాటులోకి తెచ్చామని, ఎంత మంది ఏజెంట్లు వచ్చినా లైసెన్స్‌లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సహకారంతో మార్కెట్‌యార్డును మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. అనంతరం చిప్స్ అండ్ ఫల్వరైజ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ ఆంధ్రయ్య, గామాలపాడు సర్పంచ్ జంగా సురేష్, 1వ వార్డు కౌన్సిలర్ చాట్ల క్రాంతికుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పుల గురవారెడ్డి, ఉపాధ్యక్షులు నెల్లూరి రామస్వామి, బొల్లా శ్రీనివాసరావు, సభ్యులు సయ్యద్ జాన్, ముశ్యం శ్రీనివాసరావు, పల్లపు హనుమంతరావు, గద్దల వేదమణి, పత్రా రమేష్, గొట్టం అంజిరెడ్డి, జంగా సైదులు, మందపాటి వెంకట్రామిరెడ్డి, వీరమళ్ల రమేష్, సుబ్బారావు తదితరులున్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ పిఆర్కే

దుర్గి: మండలంలోని కోలగుట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ నిర్మాణంతో పాటు గణపతి, శ్రీ వీరాంజనేయస్వామి, నంది విగ్రహాలను వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ప్రభుత్వ విప్ పిఆర్కే కు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన ఆలయ నిర్మాణానికి సహకరించిన గ్రామస్తులను అభినందించారు. పూజారి సూరయ్య శాస్త్రి, ఏఎంసీ చైర్మన్ వెలిదండి గోపాల్, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, ఎంపీటీసీ నక్క ఆదినారాయణ, వైస్ సర్పంచ్ మమ్ము శ్రీనివాస్, నాయకులు మద్దికర ఆదిరెడ్డి, కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబు, కటకం చిన్న వెంకటయ్య, తోట మూర్తి, దేవిరెడ్డి, చిన్న మస్తాన్, సమరావత్ వెంకట నరసయ్య, దేవిరెడ్డి వెంకటేశ్వర్లు, చలవాది సత్యనారాయణ, కటకం గోపాల్, నలబోలు మంగరావు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి పూజలకు కోటేశ్వరస్వామి ఆలయం సిద్ధం



నాదెండ్ల: చిరుమామిళ్ల గ్రామంలో కొలువైయున్న కోటేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయింది. ఈ నెల 18న జరగనున్న పండుగను పురస్కరించుకుని ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లింగోద్భావ సమయంలో అభిషేకాలు, అర్చనలు జరపటంతో పాటూ గ్రామ ప్రభలు ఏర్పాటు చేయనున్నారు. రాత్రి కోలాటం, భజన కార్యక్రమాలు, భారీ అన్నదానానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త కొల్లిపర శ్రీనివాసరావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శివారెడ్డి తెలిపారు. ఆలయానికి రంగులు వేసి తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కోలాహలంగా గిరిప్రదక్షిణ

నరసరావుపేట రూరల్: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కోటప్పకొండ గిరిప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులు గిరిప్రదక్షణను ప్రారంభించారు. సోపాన మార్గంలోని విఘ్నేశ్వరుని ఆలయం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం గిరిప్రదక్షణను ప్రారంభించారు. శివనామస్మరణ చేస్తూ భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయ అధికారులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తాగునీరు, మజ్జిగ, అల్పాహారాన్ని అందజేసారు.